# నవంబరు 26న సార్వత్రిక సమ్మెను విజయవంతంచేయండి

## ఏఐఎఫ్‌టియు(న్యూ)పిలుపు

**మన** దేశంలో కార్మిక రైతాంగం పోరాడి సాధించుకొన్న హక్కులను కాలరాయడానికి పాలక వర్గాలు పూనుకొన్నారు. కార్మిక, రైతాంగ హక్కులను చట్టపరంగానే రద్దు చేయడం ద్వారా కార్మిక, రైతాంగంపై దాడులకు సిద్ధపడ్డారు. దీనికి కరోనా సమయాన్ని ఎంచుకొన్నారు. సామ్రాజ్యవాదులకు, వారి దళారి కార్పోరేట్‌లకు కోట్లాది రూపాయిల నష్ట పరిహారం అందిస్తూనే అసంఖ్యాక కార్మిక ప్రజా రాశులను క్రూరమైన దోపిడీకి, పీడనలకు గురిచేసారు. కరోనాను అడ్డుపెట్టుకొని వారిని వీధుల్లోకి గెంటివేసి,అడుగడుగునా తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శించారు. పార్లమెంటు వేదికగానే అన్ని రకాల వంచనలతో కార్మిక,రైతు వ్యతిరేక బిల్లులను, బయట కార్మిక, రైతాంగ నిరసనల మధ్య అమోదించబడ్డట్లు పాలకులు ప్రకటించారు.

కేంద్రంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక,కార్మిక వ్యతిరేక, రైతు వ్యతిరేక, జాతి వ్యతిరేక విధానాలపై పోరాడమని కేంద్ర కార్మిక సంఘాలు కార్మిక వర్గానికి పిలుపు నిచ్చాయి. నవంబరు 26 న దేశ వ్యాపితంగా సమ్మె నిర్వహించడం ద్వారా తమ నిరసనను తెలుపమన్నాయి.

వ్యాపారాన్ని పెంచడం, సులభతరం చేయడం అన్న పేరుతో ప్రభుత్వం తీసుకొంటున్న చర్యలన్నీ కార్మికులను బలిపశువులుగా చేసి స్వదేశ, విదేశీ కార్పోరేట్ వర్గాలకు దేశ సంపదలను దోచిపెట్టేవిగా వున్నాయి. జాతీయోద్యమ కాలం నుండీ కార్మికోద్యమం చేసిన పోరాటాలు, త్యాగాల ఫలితంగా 44 కార్మికచట్టాలు రూపుదిద్దుకొన్నాయి. వాటిని పూర్తిగా అమలు జరపాలన్న చిత్తశుద్ధిని పాలకులు ఏనాడు ప్రదర్శించలేదు. వ్యక్తులుగా, సంఘటితంగా ఎదురుతిరిగిన చోట ఎంతోకొంత మేర ప్రయోజనం పొందగలిగారు. పరిశ్రమల యజమానులు తమ ఇష్టం వచ్చినట్లు వ్యవహరించకుండా-వ్యతిరేకించిన కార్మికులను ఉద్యోగాలనుండి తొలగించకుండా, పని ప్రదేశంలో కొన్ని సౌకర్యాలు కల్పించేవిధంగా, పనిగంటలు, షిఫ్టులు, మూసివేతలవంటి సందర్భాలలో ఎంతో కొంత చట్టాలు వారిని ఇబ్బంది పెట్టాయి.యజమాని దయా దాక్షిణ్యాలకే వదలివేయకుండా కార్మికులతో వచ్చిన వివాదాలలో ప్రభుత్వ విభాగాలు తప్పనిసరి మధ్యవర్తి పాత్రను నిర్వహించాల్సి వచ్చింది.

సామ్రాజ్యవాద ప్రపంచీకరణ నేపధ్యంలో, సంక్షోభం మరింత పెరుగుతున్న ఈ కాలంలో కార్మికవర్గంపై మరింత తీవ్రమైన దోపిడీ, పీడనలను అమలు చేయడానికి పాలక పార్టీలు, బడా పెట్టుబడిదారులు చాలాకాలంగా అనేక పథకాలు రచిస్తూ, అమలుచేస్తూ వచ్చారు. కాంగ్రెసు పాలనలో కొత్తగా వచ్చిన సెజ్‌లను ఈ చట్టాల నుండి మినహాయించారు. ప్రత్యేక ప్రతిపత్తి గల వాటిగా వాటికి రక్షణ కల్పించారు. బిజెపి పాలకులు గతంలో సాగింది లైసెన్సు రాజ్ అని ఎద్దేవా చేస్తూ ప్రభుత్వ పర్యవేక్షణ నుండి పరిశ్రమలను తప్పిస్తామన్న సంకేతాలు ఇస్తూ వచ్చారు. కార్మిక చట్టాలను యజమానులకు అనుకూలంగా సవరించేందుకు నిపుణుల, న్యాయకోవిదుల బృందాలను కార్పోరేట్ల కనుగుణంగా వేశారు.వారి సిఫార్సుల మేరకు 44 కార్మిక చట్టాలను 4 కోడ్‌లుగా కుదించేందుకు పథక రచన చేసారు.

వాటిలో వేతనాల కోడ్‌ను 2019 లోనే ఆమోదింప చేసుకొన్నారు. మిగిలిన మూడింటిని (1. పారిశ్రామిక సంబంధాలు 2. సామాజిక భద్రత-సంక్షేమం 3.వృత్తిపరమైనబాధ్యత, ఆరోగ్యం, పనిపరిస్థితులు) లాక్‌డౌన్ కాలంలో సెప్టెంబరులో రెండు సభలలో ఆమోదింప చేసుకొన్నారు. దీనితో స్వేచ్ఛగా వాణిజ్యం చేసుకొనేందుకు తగినట్లుగా సింగిల్ విండోలో ప్రభుత్వ శాఖల నుండి అనుమతులు పొందటంతో పాటు కార్మిక హక్కులను కాపాడటం, పని ప్రదేశాలలో ప్రమాదాలనుండి తగిన రక్షణ చర్యలు చేపట్టటం, ఉద్యోగులను పనిలోనుండి ఎప్పుడైనా తొలగించే, మహిళలతో రాత్రి షిఫ్ట్‌లలో పనిలో పెట్టుకోకూడదన్న షరతులనుండి వారికి స్వేచ్ఛ కల్పించారు. 10-20 మంది కార్మికులు వుంటేనే పరిశ్రమలుగా పరిగణించే షరతులు వర్తింపచేసే వాటిని మార్చి 100 నుండి 300 లోపు కార్మికులు ఉండే వాటికి చట్టాలనుండి మినహాయింపులు ఇచ్చారు. యజమానులకు, కార్మికులకు మధ్య అసలే అసమాన సంబంధాలు ఉన్న నేటి పరిస్థితిలో సమిష్టి బేరసారాల శక్తిని దెబ్బతీసి,ట్రేడ్ యునియన్ హక్కులను కాలరాచి కార్మిక, యాజమాన్య సంబంధాలను ఏకపక్ష కార్మిక వ్యతిరేక స్వభావం కలవిగా మార్చ బోతున్నారు. నిర్దిష్ట కాలపరిమితి ఒప్పంద ఉద్యోగాల పేరుతో అన్ని ఉద్యోగాలను కాంట్రాక్టు ఉద్యోగాల స్థాయికి తేబోతున్నారు.(చూ. 20-5-2018 జనశక్తి). దేశంలో మొత్తం శ్రమ జీవులలో సంఘటిత రంగంలో ఉన్నదే 7 శాతంగా ఉంటే ఇప్పుడు వారిపైన కూడా ఈ దాడి ఎక్కుపెట్టబడింది.

ఇప్పుడు చేసిన కోడ్‌ల నుండి కూడా పూర్తిగానో పాక్షికంగానో పరిశ్రమలకు మినహాయింపు ఇచ్చే అధికారాన్ని ప్రభుత్వానికి ఇచ్చాయి ఈ చట్టాలు. విదేశీ పెట్టుబడులను ఆకర్షించేపేరిట వారికి దేశంలో భూమిని రైతులనుండి సేకరించి అప్పగించే బాధ్యతను,పర్యావరణ అనుమతులు ఇప్పించే బాధ్యతను కూడా పాలకులే నిర్వహిస్తారు.

మరోవైపు ప్రభుత్వం ప్రభుత్వ రంగంలో లక్షలాది కార్మికులకు, ఉద్యోగులకు ఉపాధి కల్పిస్తున్న ప్రభుత్వరంగ సంస్థల అమ్మకాలకు, పెట్టుబడుల ఉపసంహరణకు చర్యలు ప్రకటించారు.

రక్షణ, బ్యాంకింగ్, ఇన్సూరెన్సు, స్టీలు, ఎరువులు, పెట్రోలియం వంటి రంగాలలోకి ప్రైవేటు పెట్టుబడులను ఆహ్వానించడం లేదా పరిమితులు ఉంటే వాటిని ఎత్తివేయడానికి పూనుకొన్నారు. ఆస్తుల అమ్మకం ద్వారా 12 లక్షల కోట్లు, పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా 90 వేల కోట్లు సమకూరుస్తామని ప్రకటించారు. ఎయిర్ ఇండియా, ఎన్.టి.పి.సి, సిమెంట్ కార్పోరేషన్, భారత ఎర్త్ మూవర్స్, స్టీలు అథారిటి ఆఫ్ ఇండియా వంటి సంస్థలను ప్రయివేటుకి అమ్మి వేస్తారు. పెట్రోలు రంగంలోని బిపిసి ఎల్, కోల్ ఇండియా, జాతీయ మైనింగ్ కార్పోరేషన్‌లోని ప్రభుత్వ షేర్లను వెనక్కు తీసుకొంటారు.

బ్యాంకింగ్, ఇన్సూరెన్సు వంటి వాటిల్లోకి ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహిస్తున్నారు. 1970-80లలో 20 ప్రైవేటు బ్యాంకులను నాటి కాంగ్రెస్ ప్రభుత్వం జాతీయం చేసేందుకు చట్టం చేసింది. బిజెపి పాలకులు బ్యాంకుల సంఖ్యను 27 నుంచి 12 కి కుదించి వేసారు. వాటిలో 4 మాత్రమే ఉంచుకొని మిగతావాటిని ప్రైవేటు పరం చేస్తామని ప్రకటించారు. అప్పుల ఎగవేత దారులను రక్షించేందుకు ఇటీవల కాలంలో 3 లక్షల 50 వేల కోట్ల రూపాయిల ప్రజా ధనాన్ని కేటాయించారు.

సంవత్సరానికి కోటి ఉద్యోగాల కల్పన అన్న పాలకుల నినాదం గాలిలో కలసి పోయింది. కొత్త ఉద్యోగాల కల్పనా లేకపోగా ఉన్న ఉద్యోగాలే కోల్పోతున్న పరిస్థితి, ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో నెలకొంది. నిరుద్యోగం మున్నెన్నటికన్నా పెరిగినట్లు జాతీయ గణాంక సంస్థలు ప్రకటించాయి. కోవిడ్ ఫలితంగా లాక్ డౌన్ కాలంలో ఇది మరింత పతాకస్థాయికి చేరింది. తెలుగు రాష్ట్రాలలో విద్యారంగంలో పనిచేసే ఉపాధ్యాయుల, లెక్చరర్లు ఉపాధిపోయి ఆత్మహత్యలకు పాల్పడటం చూసాము.

ఇక రైతాంగ పరిస్థితి దయనీయంగా మారింది. లాక్ డౌన్ కాలంలో రవాణా లేక వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్టు లేక రైతాంగం భారీగా నష్టపోయారు. గోరుచుట్టుపై రోకలి పోటు అన్నట్లు కేంద్రం ఈ కాలంలోనే మూడు రైతు వ్యతిరేక చట్టాలను పార్లమెంటులో పెట్టిఆమోదింప చేసుకొంది. పైకి రైతులు తమ పంటలను దేశంలో ఎక్కడైనా అమ్ముకొనేలా ఆంక్షలను రద్దు చేసామని చెప్పుకొంటున్నారు. ఆచరణలో వ్యవసాయ మార్కెట్‌లలో ప్రస్తుతం పొందుతున్న రక్షణను కూడా రద్దుచేసేందుకు, రైతుకు కనీస మద్దతుధర ఇచ్చే బాధ్యత నుండి ప్రభుత్వం తప్పుకొనేందుకు ఉద్దేశించారు. మరోవైపు కొత్తగా విస్తరిస్తున్న మాల్స్ (రిలయన్సు, మోర్, డిమార్ట్, బిగ్‌బజార్, మెట్రో వగైరా...) కార్పోరేట్లు రైతు ఉత్పత్తులను కారుచౌకగా కొల్లగొట్టేందుకు ఉద్దేశించినవి. ఉత్పత్తి ప్రక్రియలో కాంట్రాక్టు వ్యవసాయాన్ని అమలు చేయబోతూ రైతాంగాన్ని కట్టు బానిసల స్థాయికి దిగజార్చదలచుకొన్నారు. దేశీయ ఉత్పత్తులకు, పంటలకు రక్షణ లేకుండా చేసి విదేశీ దిగుమతులపై సుంకాలు తగ్గించి వారికి మార్కెట్టులు పెంచేవిగా పాలకుల చర్యలు ఉన్నాయి. మన కార్మిక శక్తిని కారుచౌకగా దోచుకొనేందుకు విదేశీ, స్వదేశీ గుత్త సంస్థలకు కావలసిన పక్కా ఏర్పాట్లకు పాలకులు పూనుకొన్నారు.

ఇలాంటి స్థితిలో రైతు వ్యతిరేక బిల్లులకు వ్యతిరేకంగా రైతాంగం మిలిటెంట్‌గా వీధులలో వచ్చి పోరాడుతున్నారు. ఈ పోరాటానికి కార్మిక వర్గం మద్దతుగా నిలవాలి. కార్మిక వర్గం వర్గ రాజకీయ చైతన్యం పెంపొందించుకొంటూ ఉద్యమించాలి. అప్పుడే దోపిడీ పాలక వర్గాల నిజ స్వభావాన్ని కార్మికవర్గం గుర్తించి మిలిటెంట్‌గా పోరాడగలుగుతుంది. పాలక పార్టీల బండారాన్ని గుర్తించి కార్మిక, విద్యార్థి ప్రజాతంత్ర శక్తులతో రైతాంగం ఐక్యంగా, సంఘటితంగా నిలవాలి. విప్లవకర, ప్రజాతంత్రశక్తులు నవంబరు 26 సాధారణ సమ్మె విజయవంతానికి, కార్మికుల మధ్య వర్గ రాజకీయ ప్రచార, ఆందోళనా కృషి సాగించాలి.

ooo

# ఏఐకెఎస్‌సిసి ఇచ్చిన నవంబర్ 5 ఆందోళనా కార్యక్రమాన్ని విజయవంతంచేయండి

**ఇటీవల** మోడీప్రభుత్వం చేసిన మూడు వ్యవసాయ వ్యతిరేక చట్టాలను నిరసిస్తూ దేశవ్యాపితంగా ప్రత్యేకించి పంజాబ్, హర్యానా తదితర ఉత్తరాది రాష్ట్రాలలో ఆందోళనలు మిలిటెంట్‌గా, నిరంతరాయంగా సాగుతున్నాయి. పంజాబ్ రాష్ట్రంలో రైల్‌రోకో సాగిస్తున్నారు దానిని ఉపసంహరించుకునేవరకు రాష్ట్రానికి అవసరమైన సరకుల రవాణాను కూడా కేంద్రప్రభుత్వం నిలిపివేస్తూ నిరంకుశ చర్యలకు పాల్పడుతోంది.

ఈ నేపథ్యంలో దేశవ్యాపితంగా పలు రైతు, రైతుకూలీ సంఘాలతోపాటు ఏఐకెఎమ్‌కెఎస్ భాగస్వామిగా వున్న ఏఐకెఎస్‌సిసి 2020 నవంబర్ 5న జాతీయరహదారులను దిగ్బంధించాలని, పలురూపాల్లో ఆందోళనలు నిర్వహించాలని పిలుపునిచ్చింది. దీని కనుగుణంగా నవంబర్ 5న మన రాష్ట్రంలో జరగనున్న ఆందోళనా కార్యక్రమాల్లో రైతు, కూలీలంతా పాల్గొనాలని, నవంబర్ 26వ తేదీన దేశవ్యాపిత కార్మికసంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా జరిగే సార్వత్రిక సమ్మెకు రైతాంగ శ్రేణులు సంఘీభావంగా నిలవాలని రైతుకూలీసంఘం(ఆం.ప్ర) పిలుపునిస్తోంది.

**విజయవాడ**
**31-10-20**

**యస్. ఝాన్సి**
**అధ్యక్షులు**
**రైతుకూలీసంఘం(ఆం.ప్ర)**
**(ఏఐకెఎమ్‌కెఎస్ అనుబంధం)**